క్లుప్తంగా

వైభవంగా గ్రామోత్సవం



వరికుంటపాడు: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వరికుంటపాడులో సీతారాములకు గ్రామోత్సవం నిర్వహించారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలను అశ్వవాహనంపై కొలువుదీర్చి ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు వారుపోసి స్వామి, అమ్మవార్లకు స్వాగతం పలికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

అనుమసముద్రంపేట: మండలంలోని చిరమన జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంచర్ల శేషయ్యనాయుడు ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. సరస్వతిపూజలో 10వ తరగతి విద్యార్థులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకుడు అంకయ్యచౌదరి, ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు

కావలిరూరల్: కావలి బార్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో అభ్యర్థులుగా కృష్ణమోహన్, ఐ.వి.రామిరెడ్డి పోటీ పడ్డారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి జాకీర్‌హుసేన్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు.

ఉపాధి పనుల తనిఖీలు

చేజర్ల: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై గత మూడు రోజులుగా తనిఖీలు నిర్వహిస్తున్నారని ఎంపీడీఓ విజయలలిత తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ చేజర్ల మండలంలో 2021–22 సంవత్సరానికి సంబంధించిన పనులను తనిఖీ చేస్తున్నారని, ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.5.26 కోట్లు కూలీల వేతనాలకు, రూ.2.98 కోట్లు మెటీరియల్‌కు చెల్లించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ సామాజిక తనిఖీ బృందం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తోందని, త్వరలో బహిరంగసభ నిర్వహిస్తామని తెలిపారు.

లైబ్రేరియన్‌కు అభినందన



అవార్డు అందుకుంటున్న డాక్టర్ శేషయ్య

కావలి: పట్టణంలోని విట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఒ.శేషయ్య బెస్ట్ పేపర్ ప్రజెంటేషన్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక కళాశాలలో ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దత్తాత్రయశర్మ శుక్రవారం ఆయనను అభినందించారు. కర్నూలులోని సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాలలో జరిగిన జాతీయస్థాయి సెమినర్‌లో 'లైబ్రరీ సేవల్లో సంప్రదాయ పద్ధతుల నుంచి ఆధునిక సాంకేతికతతో కూడిన డిజిటల్ విధానాన్ని విట్స్ ఇంజినీరింగ్ కళాశాలలోని సెంట్రల్ లైబ్రరీలో అమలు చేస్తున్న విధానంపై పత్రసమర్పణ చేసినందుకు ఆయన ఈ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు ఆయనకు అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



మట్టి పెళ్లలు తొలగిస్తున్న పోలీసులు

సంగం: నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు సంగం ఎస్సై నాగార్జునరెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారు. మండలంలోని పెరమన వద్ద జాతీయ రహదారిపై రైతుల ట్రాక్టర్ల వల్ల చేరిన మట్టి పెళ్లలను శుక్రవారం సిబ్బందితో తొలగించే పనులు నిర్వహించారు. ఎస్పీ విజయారావు ఆదేశాల మేరకు మండలంలో ఎక్కడా రోడ్డు ప్రమాదాలు జరగకుండా సిబ్బంది సహకారంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

సోమశిలలో 54.604 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 54.604 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 347 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. పెన్నార్ డెల్టాకు 1,200 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 403, దక్షిణకాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 97.134 మీటర్ల నీటి మట్టం నమోదైంది. సగటున 315 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వృథా అవుతోంది.

అభివృద్ధిలో అందరి భాగస్వామ్యం అవసరం

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



బాల భవిత వికాస కేంద్రం, ఎస్ఎన్‌సీయూ భవనాల శిలాఫలకాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తదితరులు

ఆత్మకూరు: స్థానికంగా ఉన్న ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో స్థానికులతోపాటు ఇతర ప్రాంతవాసులకు కూడా సేవలు అందుతున్నాయని, ఈ ఆస్పత్రి అభివృద్ధిలో అందరి భాగస్వామ్యం అవసరమని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఆస్పత్రిలో జిల్లా బాల భవిత వికాస కేంద్రం(డీఐఈసీ) నూతన భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే ఎస్ఎన్‌సీయూ జెరియాట్రిక్ కేంద్రాన్ని, 500 కేఎల్ ఆక్సిజన్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. నూతన భవనంలో ఏర్పాట్లను పరిశీలించారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆత్మకూరులోని జిల్లాస్థాయి ఆస్పత్రిలో పేదలకు ఉచితంగా ఆధునిక వైద్యసేవలు అందుతాయన్నారు. 150 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయిన ఈ ఆస్పత్రికి సిబ్బంది తగినంత మంది ఉన్నారని, భవన వసతి గురించి ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలో ఏర్పాటయ్యేలా చేస్తామని తెలిపారు. ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం(ఏడీఎఫ్) ద్వారా చేపట్టే సేవా కార్యక్రమాలకు దాతలు తోడైతే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేయవచ్చన్నారు. కరోనా సమయంలో ఆస్పత్రిలో భారీ ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేశారని, తద్వారా ఎందరికో ఆక్సిజన్ అందించారని, అదే క్రమంలో మరో ఆక్సిజన్ ప్లాంట్ ఆస్పత్రిలో ఏర్పాటు చేయడం మంచిపరిణామమన్నారు. ఉదయగిరి, సీతారామపురం, వైఎస్సార్ జిల్లా బద్వేల్, మైదుకూరు తదితర ప్రాంతాల ప్రజలు ఈ ఆస్పత్రికి వైద్యం కోసం రావడం, వారికి మెరుగైన సేవలు అందించడంపై ఆయన డాక్టర్లను, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, డీఎంహెచ్ఓ పెంచలయ్య, ఆస్పత్రి సూపరింటెండెంట్ శేషారత్నం, ఆర్ఎంఓ ఉషాసుందరి, కంటి వైద్యురాలు శార్వాణి, పలువురు డాక్టర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ జి.వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్లు డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, ఎన్.ప్రతాప్‌రెడ్డి, ఐవీ రమణారెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, పలువురు కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో అన్నదానం ప్రారంభం

ఆత్మకూరుకు చెందిన కంచి పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆస్పత్రిలో రోగులకు, వారి బంధువులకు నిరంతరం అన్నదానం చేసేందుకు ముందుకురావడం అభినందనీయమని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆత్మకూరు ఆస్పత్రిలో కలెక్టర్ అనుమతితో దాత పరమేశ్వరరెడ్డి రోగుల సౌకర్యార్థం అన్నదానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. రోగులతోపాటు అవుట్ పేషెంట్లకు, వారి సహాయకులకు కూడా దాతలు భోజనం అందిస్తానమని తెలపడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులతోపాటు విశ్రాంత ఉపాధ్యాయులు కేవీ శేషారెడ్డి, నారాయణరావు, దాత పరమేశ్వరరెడ్డి కుటుంబసభ్యులు సత్యనారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

సమస్యల పరిష్కారమే ధ్యేయం



మాట్లాడుతున్న ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: సమస్యల పరిష్కారమే ధ్యేయంగా 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నువ్వూరుపాడులో శుక్రవారం 'గడప గడపకు మన ప్రభుత్వం'పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సచివాలయం పరిధిలో గుర్తించిన 129 సమస్యల్లో 68 ఇప్పటికే పరిష్కరించామన్నారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనరసింహం, వ్యవసాయాధికారి కిషోర్‌బాబు, సర్పంచ్ దొరసానమ్మ, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీప్రసన్న, వీఆర్వో మాల్యాద్రి, నాయకుడు గడ్డం శ్రీనివాసులురెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అడవుల పరిరక్షణతో మానవాళికి రక్షణ



మాట్లాడుతున్న అటవీశాఖ అధికారులు

మర్రిపాడు: అడవుల పరిరక్షిస్తే మానవాళిని రక్షిస్తాయని డిప్యూటీ రేంజ్ అధికారి రాజశేఖర్‌గౌడ్ అన్నారు. మండలంలోని చాబోలు గ్రామంలో శుక్రవారం గ్రామస్తులకు అడవుల పరిరక్షణపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, వేసవిలో అడవుల్లో మంటలు చెలరేగుతాయని, వాటిని నివారించాలని తెలిపారు. అడవుల్లో పశువుల కోసం నీటితొట్టెలు, చెక్‌డ్యాంలను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ గోపీనాథ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో బీట్ అధికారులు సాయికృష్ణ, తిరుపతి, ఫర్స్ డైరెక్టర్ రమణయ్య, హెల్త్ సూపర్‌వైజర్ సైదా, సిబ్బంది పాల్గొన్నారు.

సంపద కేంద్రం పరిశీలన



సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి చిరంజీవి

చేజర్ల: మండలంలోని పాడేరు పంచాయతీలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి బి.చిరంజీవి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త ద్వారా వర్మీకంపోస్టు ఎరువు తయారు చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామంలో ఎక్కడా చెత్త లేకుండా సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం పాడేరు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బందితో ఎస్‌డీజీ(సుస్థిరాభివృద్ధి ప్రణాళిక) సర్వే, ఆయుష్మాన్ భారత్, ఇంటి పన్ను వసూలు, సిబ్బంది పనితీరుపై సమీక్ష నిర్వహించారు. వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలలిత, విస్తరణాధికారి రామయ్య, సర్పంచ్ గుమ్మా వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి శీనయ్య, మండల కోఆర్డినేటర్ ఎస్‌కే అబ్దుల్‌సలాం, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి



సచివాలయ ఉద్యోగులకు సూచనలిస్తున్న డీఎల్‌డీఓ కనకదుర్గాభవాని

జలదంకి: సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని డీఎల్‌డీఓ ఎస్.కనకదుర్గాభవాని సూచించారు. శుక్రవారం స్థానిక 1, 2 సచివాలయాలను ఆమె తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ మాట్లాడుతూ సచివాలయ సేవలను ప్రజలకు చేరువ చేయాలన్నారు. ప్రతి రోజూ సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు సచివాలయాల్లో 'స్పందన' కార్యక్రమం నిర్వహించి ప్రజలు అందించే అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలన్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి వలంటీర్ల ద్వారా జరిగే పింఛన్ల పంపిణీని పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'గడప గడపకు మన ప్రభుత్వం'పై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయలలిత

చేజర్ల: మండలంలోని చిత్తలూరు గ్రామ సచివాలయంలో శుక్రవారం 'గడప గడపకు మన ప్రభుత్వం'పై ఎంపీడీఓ విజయలలిత సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ఇళ్లకు సంబంధించి కొత్తగా కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సుస్థిరాభివృద్ధి ప్రణాళిక(ఎస్‌జీడీ) సర్వే పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అచ్చి ఆంజనేయులు, సచివాలయ ఉద్యోగులు, నాయకుడు మోడేపల్లి పెంచలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

ఆత్మకూరు: ఆస్పత్రిలో వైద్యం పొంది ఆరోగ్యశ్రీ వర్తించని ఓ వ్యక్తికి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి అందిన చెక్కును అందజేశారు. ఆత్మకూరుకు చెందిన ముసునూరు ఈశ్వరమ్మ అనారోగ్యానికి గురై చికిత్స పొందింది. ఆమెకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా చెక్కు మంజూరు కావడంతో శుక్రవారం ఆత్మకూరులో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి లబ్ధిదారు బంధువులకు చెక్కు అందజేశారు. ఎమ్మెల్యే వెంట కౌన్సిలర్ రాధికారెడ్డి, నాయకులు ఉన్నారు.

సచివాలయాల్లో తనిఖీలు

బిట్రగుంట: బోగోలు మండలంలోని పలు సచివాలయాలను గ్రామ, వార్డు సచివాలయాల హెచ్ఓడీ అశోక్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల పరిధిలో జరుగుతున్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సర్వేను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయాల పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయడం, గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీల సేవలు అందేలా చూడడం, రక్తహీనత, పోషకాహారలోపం ఉన్న గర్భిణులు, చిన్నారులను గుర్తించడంలో మహిళా పోలీసులు కీలకంగా వ్యవహరించాలని సూచించారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

జలదంకి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి పరీక్ష కేంద్రాలను శుక్రవారం కావలి డిప్యూటీ ఈఓ హరిప్రసాద్ పరిశీలించారు. ఈ పాఠశాలలో రెండు సెంటర్లను ఏర్పాటు చేయగా విద్యార్థులకు అవసరమైన వసతులు ఏర్పాటు చేశారా లేదా అని పరిశీలించారు. బెంచీలు, లైట్లు, ఫ్యాన్లు, టాయిలెట్లు తదితరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఎంఈఓ శ్రీధర్, ఆ పాఠశాల హెచ్ఎం కొండారెడ్డితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల సమయంలో తాగునీరు, వైద్య సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రం–ఏ లో 187 మంది విద్యార్థులు, పరీక్ష కేంద్రం–బి లో 196 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం ఎంఈఓతో కలిసి చామదల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు.

బస్ సౌకర్యం కల్పించాలి

వరికుంటపాడు: ఈ నెల 3వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని మండలంలోని పదో తరగతి విద్యార్థులు పరీక్షాకేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీ అధికారులు బస్ సౌకర్యం కల్పించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. మండలంలో 264 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. మండలంలోని తూర్పుదొంపిదొడ్డ, తిమ్మారెడ్డిపల్లి, జడదేవి, వరికుంటపాడు, కాకొల్లువారిపల్లి, విరువూరు, కొండాయపాళెం, పెద్దిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్లాల్సిఉంది. ఉదయగిరి డిపో అధికారులు స్పందించి బస్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

విద్యార్థులకు ప్యాడ్ల వితరణ

సోమశిల: సోమశిల ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాన్ని శుక్రవారం జిల్లా యానాదుల సంఘం అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు, ఆత్మకూరు నియోజకవర్గ అధ్యక్షుడు మధు తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు కంపా వెంకటేశ్వర్లు, కంపా శ్రీనివాసులు అందజేసిన అందజేసిన పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. జనరల్ సెక్రటరీ పెంచలయ్య, ట్రెజరర్ హనుమంతు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ చర్యలతో ప్రజలకు కష్టాలు

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



సీఎం కార్యదర్శి ధనంజయరెడ్డితో చర్చిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: పట్టణంలోని 8 వేల కుటుంబాల గృహాలను, ఇంటి స్థలాలను 2018లో చంద్రబాబు ప్రభుత్వం నిషేధిత భూముల జాబితాలో పెట్టిందని, దాని వల్ల ప్రజలు అనేక కష్టాలు పడుతున్నారని, ప్రజలు ఎదుర్కొంటున్న ఈ సమస్యను పరిష్కరించాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యాలయంలో ముఖ్యమంత్రి కార్యదర్శిగా మున్సిపల్, అటవీశాఖలను పర్యవేక్షించే సీనియర్ ఐఏఎస్ అధికారి కె.ధనంజయరెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన్ను కావలి ఎమ్మెల్యే కలిసి సమస్యను విన్నవించారు. కావలి పట్టణంలో 40 ఏళ్ల నుంచి 70 ఏళ్ల క్రితం తాతలు ముత్తాతలు కొనుగోలు చేసిన ఇంటి ఆస్తులను ప్రస్తుతం వారి కుటుంబీకులు ఆర్థిక అవసరాల కోసం అమ్మకాలు చేయడానికి, భాగాలు పంచుకోవడానికి సాధ్యపడని విధంగా 2018లో చంద్రబాబు ప్రభుత్వం నిషేధిత జాబితాలో పెట్టేసిందని ఎమ్మెల్యే వివరించారు. అటవీశాఖ 45 ఏళ్ల క్రితం ఈ భూములను తాము వదులుకున్నామంటూ విడుదల చేసిన జీఓను ప్రస్తుతం తమను తీసుకురమ్మంటున్నారని, ఆ జీఓ ప్రజల వద్ద ఎలా ఉంటుందని తెలిపారు. ప్రజలు ఏళ్ల తరబడి నివాసాలు ఏర్పరచుకొని ఉంటున్న పట్టణంలోని వెంగళరావునగర్, తుఫాన్‌నగర్, ఇందిరానగర్, జనతాపేట, వైకుంఠపురం తదితర ప్రాంతాలను ఏ ప్రాతిపదికన చంద్రబాబు ప్రభుత్వం నిషేధిత భూముల జాబితాలో పెట్టిందో అధికారులు చెప్పలేకపోతున్నారని తెలిపారు. ఈ దుర్మార్గం నుంచి కావలి పట్టణ ప్రజలకు విముక్తి కల్పించాలని ఎమ్మెల్యే కోరారు.

పేదలకు అండగా సీఎం వైఎస్ జగన్

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సోమశిల: పేద, బడుగు, బలహీన వర్గాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అనంతసాగరంలో పొదుపు మహిళలకు వైఎస్సార్ ఆసరా 3వ విడత చెక్కు పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పిల్లల ఉజ్వల భవిష్యత్ ఒక్క జగనన్నతోనే సాధ్యమని, రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేసి మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతసాగరంలో త్వరలో ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ద్వారా 10 డిజిటల్ తరగతి గదులను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. కోట్లాది రూపాయలతో ఆత్మకూరులో బస్టాండ్ రూపుదిద్దుకుంటోందని, అనంతసాగరంలో కూడా దాతల సహకారంతో నూతనంగా బస్టాండ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రధాన సమస్యలపై సర్వే చేశామని, కొన్నింటిని స్థానికుల సహకారంతో పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం 516 స్వయం సహాయ సంఘాలకు రూ.4.76 కోట్ల ఆసరా మూడో విడత నమూనా చెక్కును లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. తొలుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల మహిళలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రాపూరు వెంకటసుబ్బారెడ్డి, ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, వైస్ ఎంపీపీలు అల్లంపాటి సుధాకర్‌రెడ్డి, పాణెం శ్రీనివాసులు, రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కాలువ నరసింహులు, సొసైటీ చైర్మన్ కేతా రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీ మెట్టుకూరు సుజాతమ్మ, సర్పంచ్ శోభ, ఏరియా కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, ఏపీఎం వెంకటరమణరావు, పొదుపు సిబ్బంది పాల్గొన్నారు.

రూ.19.84 కోట్ల అంచనాలతో మున్సిపల్ బడ్జెట్

- ఆమోదించిన కౌన్సిల్

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ 2023–24 సంవత్సరం బడ్జెట్ రూ.19,84,13,964 అంచనాలతో శుక్రవారం ఆమోదం పొందింది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని ఎంజీఆర్ సమావేశ మందిరంలో 2023–24 సంవత్సర బడ్జెట్‌ను మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు, చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ ప్రవేశపెట్టారు. ప్రారంభ నిల్వ రూ.5,58,44,141 ఉండగా, సాధారణ జమలు, మూలధనం రూ.14,25,69,823గా చూపారు. దీంతో మొత్తం ఆదాయం రూ.19,84,13,964గా సవరించిన అంచనాల ప్రకారం ప్రవేశపెట్టినట్లు కమిషనర్ తెలిపారు. ఖర్చులు రూ.13,41,55,823గా చూపారు. ఆత్మకూరు మున్సిపల్ అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందించామని, ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సహకారంతో అభివృద్ధికి కృషి చేస్తున్నామని కమిషనర్ తెలిపారు. బడ్జెట్ సమావేశం చివరిలో మేకపాటి విక్రమ్‌రెడ్డి ఎక్స్‌అఫిషియో సభ్యులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమైన అభివృద్ధి పనులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఐ ఖాసీం, అన్ని వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు. జగనన్న లేఅవుట్లలో నిర్మిస్తున్న ఇళ్ల పురోగతిపై సమావేశ అనంతరం ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి హౌసింగ్ డీఈ నటరాజ్ తదితర అధికారులతో చర్చించారు.

కనుల పండువగా రథోత్సవం



కావలిరూరల్: ఉత్సాహంగా రథం లాగుతున్న భక్తులు



అల్లూరు: సీతారాముల రథోత్సవంలో పాల్గొన్న గ్రామ ప్రజలు

కావలిరూరల్: శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని ట్రంకురోడ్డులో ఉన్న రామాలయం ఆధ్వర్యంలో సీతారాములకు అంగరంగ వైభవంగా రథోత్సవం నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి రథంపై కొలువుదీర్చారు. అనంతరం ప్రారంభమైన రథోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా రథాన్ని లాగారు. రథం ముందు ప్రదర్శించిన కోలాటాలు, భజనలు, వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అల్లూరు: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా అల్లూరు పేటలో వెలసిన కోదండరామస్వామి రథోత్సవాన్ని శుక్రవారం గ్రామస్తులు కనులపండువగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు రథోత్సవంలో పాల్గొని స్వామివారి రథాన్ని లాగారు. రథంపై విహరిస్తున్న సీతారాములు భక్తులను అభయహస్తంతో కటాక్షించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా పార్వేట ఉత్సవం

చేజర్ల: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని ఎన్వీ కండ్రికలో పార్వేట ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని కోదండరామస్వామి ఆలయంలో విశేష పూజలు, అనంతరం గ్రామంలో వసంతోత్సవం నిర్వహించారు. తదుపరి భక్తుల కోలాహలం మధ్య శ్రీరాముని పార్వేట ఉత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో గ్రామస్తులు విజయ్‌బాబురెడ్డి, తేళ్ల శేఖర్‌రెడ్డి, ఆదిశేషారెడ్డి, మస్తాన్‌రెడ్డి, పి.ఆదిరెడ్డి, వెంకటరమణారెడ్డి, బాలకృష్ణారెడ్డి, దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీనరసింహం

ఆత్మకూరురూరల్: దళితులు, వెనుకబడిన వర్గాల కాలనీల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు పౌర హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోందని తహసీల్దార్ లక్ష్మీనరసింహం తెలిపారు. మండలంలోని కరటంపాడు గిరిజనకాలనీలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా తాగునీరు, అంతర్గత డ్రైనేజీ, సిమెంటు రోడ్లు, వీధిలైట్లు, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతుల కల్పనకు సంబంధిత శాఖల ద్వారా ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సర్పంచ్ రేవతి, విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యుడు ఖాజారసూల్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యుడు సిద్దం పెంచలనరసయ్య తదితరులు పలు అంశాలపై మాట్లాడారు. సమావేశంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పృథ్వీ, ఇరిగేషన్ ఏఈ సతీష్‌చంద్ర, పంచాయతీ కార్యదర్శులు రేవూరు అంకయ్య, ఎల్వీ ప్రసాద్, వీఆర్వో ప్రతాప్, మహిళా పోలీసు సునంద, కాలనీవాసులు, వలంటీర్లు పాల్గొన్నారు.

హక్కులను పరిరక్షించుకోవాలి

మర్రిపాడు: పేదలు, దళితులు వారి హక్కులను పరిరక్షించుకోవాలని తహసీల్దార్ హేమంత్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని బూదవాడ పంచాయతీ తిమ్మాయపాళెంలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో అన్నివర్గాల వారికి హక్కులు ఉన్నాయని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ సురేంద్ర, వార్డెన్ అంకయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.